క్లుప్తంగా

చురుగ్గా ఉపాధిహామీ పనులు



మునగపాకలోని కృష్ణంరాజు కాలువలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

మునగపాక : మండలంలోని పలు పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇటీవల సచివాలయాల పరిధిలో నిర్వహించిన గ్రామసభల్లో ఆమోదం తెలిపిన పనులు ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా మునగపాకలోని కృష్ణంరాజు కాలువ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఎంపీడీవో ఎం.మన్మథరావు సంబంధిత పనులను పర్యవేక్షిస్తున్నారు.

మొదలైన యల్లారమ్మ జాతర సందడి



కొండకర్ల యల్లారమ్మ పేరంటాలు

అచ్యుతాపురం: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన కొండకర్ల యల్లారమ్మ జాతర మొదలైంది.కొత్త అమవాస్యకు మొదలయ్యే ఈ జాతర మూడు రోజుల పాటు కొనసాగనుంది.ఈ ఏడాది ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధికారుల సూచనల మేరకు జాతర నిర్వహిస్తున్నారు. ఇప్పటికే గ్రామంలో జాతర సందడి మొదలైంది.

ఓటు హక్కుపై అవగాహన



ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వివరిస్తున్న దృశ్యం

అచ్యుతాపుం : మండలంలోని దిబ్బపాలెం, పూడిమడకలో కళాజాత బృందం ఆధ్వర్యంలో సోమవారం ఓటు హక్కు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఓటు ప్రాధాన్యతను వివరిస్తూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. కళా జాతర బృందం, వెలుగు ఏపీఓ చినతల్లి పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాంబిల్లి : మండలంలో సోమవారం దిమిలి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పలుమార్లు సరఫరా నిలిచిపోయింది. కరెంటు రావడం, పోవడం జరగడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. కొత్తమవాస్య సందర్భంగా గ్రామాల్లో నూకాలమ్మ తల్లి పండగ రోజున ఇలా జరగడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

14న పక్షులకు తిండి గింజలు, గూళ్లు

అనకాపల్లి: స్థానిక గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 14న అనకాపల్లి పట్టణంలోని వివిధ పార్కుల ఆవరణలో వేసవిని దృష్టిలో ఉంచుకుని పక్షులకు తిండి గింజలు (వరి కుంచలు), తాగునీటి మట్టి పాత్రలు, పక్షుల గూళ్లు ఏర్పాటు చేయనున్నట్లు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేసవికాలంలో పక్షుల గొంతు తడిపేందుకు ఇంటి బయట కాసిన్ని నీళ్లు, గుప్పెడు గింజలు ఉంచాలని ప్రజలను కోరారు. ప్రతి ఒక్కరూ సమస్త జీవుల భద్రతకు తమ వంతు కృషి చేయాలన్నారు.

వైభవంగా నూకాలమ్మ జాతర



యలమంచిలి : భక్తులకు దర్శనమిస్తున్న నూకాలమ్మ



అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు



ఎస్.రాయవరం : తిమ్మాపురంలో నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

యలమంచిలి రూరల్ : పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో నూకాలమ్మవారి జాతర మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. కొత్త అమావాస్య సందర్భంగా ఉదయం నుంచే ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చారు. పలువురు మహిళా భక్తులు చీర,రవికె, గాజులు, నల్లపూసలు, పసుపు, కుంకుమలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. కొబ్బరికాయలు, అరటి పండ్లు, పిండివంటలను అమ్మవారికి నైవేద్యంగా పెట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రతినిధి గంధం శివ ఏర్పాట్లు చేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా సత్యసాయి సేవా సమితి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థల ప్రతినిధులు మజ్జిగను ఉచితంగా సరఫరా చేశారు. అమ్మవారిని మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు భక్తులకు ఉచిత ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.

పాయకరావుపేట : కొత్త అమావాస్య సందర్భంగా సోమవారం నూకాంబిక ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలో గల అన్ని గ్రామాల్లోను నూకాంబిక ఆలయాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజించారు. నూకాంబిక అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు, పండ్లు, పూలు ఇచ్చి మొక్కులను తీర్చుకున్నారు. మండలంలో గల మంగవరం గ్రామంలో ఆదివారం జాతర నిర్వహించారు. పాయకరావుపేట పట్టణంలో గల నూకాంబిక ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకుని, అమ్మవారిని దర్శించుకున్నారు. సోమవారం ఉదయం నుంచి అమ్మవారి ఘటాలను గ్రామంలో డప్పులతో ఊరేగింపుగా తీసుకు వెళ్లి పూజలు చేశారు. అమ్మవారి ఘటాలకు చీరలు, పసుపు, కుంకుమలతో పూజించారు.

మునగపాక: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కొత్త అమావాస్య సందర్భంగా మునగపాక,పల్లపు ఆనందపురం, గవర్ల అనకాపల్లి తదితర గ్రామాల్లో ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు.

ఎస్.రాయవరం : తిమ్మాపురం గ్రామంలో కొత్త అమావాస్య జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర నిర్వహించే అమ్మవారి ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వ నిధులు కేటాయించాలని అభిప్రాయం వ్యక్త పరచారు. ఆయన వ వెంట వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్ కర్రి సత్యనారాయణ, ఎంపీటీసీ బొండా దివాణం, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీ పతిరాజు, గుర్రం నానాజీ, మందగుదుల వెంకటరమణ, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, మండల యూత్ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు, సమ్మింగి హరి పాల్గొన్నారు. ఎస్. రాయవరం, సర్వసిద్ధి, నీలాద్రిపురం గ్రామాల్లోనూ కొత్తఅమావాస్య జాతరను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఎస్.రాయవరంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు అమ్మవారి గరగను మోసి ఊరేగించారు.

రాంబిల్లి: మండలంలో పలు గ్రామాల్లో సోమవారం నూకాంబిక అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. కొప్పుగొండుపాలెం, రాజుకోడూరు, వెల్చూరు, దిమిలి, అప్పారాయుడు పాలెం, గోకివాడ, కట్టుబోలు, మురకాడ తదితర గ్రామాల్లో ఘనంగా నూకాలమ్మ తల్లి పండగను నిర్వహించారు. రాజుకోడూరులో నూకాంబిక అమ్మవారిని ఎమ్మెల్యే కన్నబాబు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, జెడ్పీటీసీ నాగరాజు, ఎంపీపీ శిరీషశ్రీనుబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కిషోర్, ఎంపీటీసీ వెంకటరావు దర్శించుకున్నారు. పలు గ్రామాల్లో నూకాంబిక అమ్మవారి ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. పసుపు, కుంకుమలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కోలాటాలు పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.



ఎస్.రాయవరం : అమ్మవారి గరగను ఊరేగిస్తున్న బొలిశెట్టి గోవిందరావు



పాయకరావుపేట : అమ్మవారి ఘటాలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు



రాంబిల్లి : రాజుకోడూరులో అమ్మవారి దర్శనానికి వచ్చిన ఎమ్మెల్యే కన్నబాబు



కొప్పుగొండుపాలెంలో నూకాంబిక అమ్మవారు



దిమిలిలో నూకాంబిక అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



దిమిలిలో అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

భక్తిశ్రద్ధలతో కొత్త అమావాస్య



దేవవరంలో అమ్మవారి ఘటాలకు పసుపు కుంకుమలు సమర్పిస్తున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు



కైలాసపట్నంలో అమ్మవారిని దర్శించుకున్న ఎంఎస్ఎంఈ చైర్మన్ సూర్యనారాయణరాజు

నక్కపల్లి: కొత్త అమావాస్య పండగను ప్రజలు సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి తెల్లవార్లు వివిధ గ్రామాల్లో అమ్మవారి ఘటాలతో జాతర నిర్వహించారు. తెల్లవార్లు ప్రజానీకమంతా మేల్కొని జాగరణలో పాల్గొన్నారు. కోలాటాలు, శక్తివేషాలు, నేల డాన్సులు, తప్పెట గుళ్లు, తీన్మార్ డాన్సులతో గ్రామాల్లో సందడి నెలకొంది. దేవవరం, గొడిచర్ల, చినదొడ్డిగల్లు, నక్కపల్లి, ఉద్దండపురం, నెల్లిపూడి, చినతీనార్ల, కాగిత, తదితర గ్రామాల్లో నూకాలమ్మ పండగ, కొత్త అమావాస్య వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. సోమవారం ఉదయం గ్రామాల్లో అమ్మవారి ఆలయాలకు వందల సంఖ్యలో భక్తులు తరిలివచ్చి దర్శించుకుని కానుకలు మొక్కుబడులు సమర్పించుకున్నారు. ఆలయాల వద్ద తీవ్ర రద్దీ ఏర్పడింది. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు ప్రసాదాలను, మజ్జిగ, మంచినీరు సరఫరా చేశారు.

కోటవురట్ల: మండలంలో కొత్త అమావాస్య పండగను సోమవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. కైలాసపట్నంలో శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని ఎంఎస్ఎంఈ చైర్మన్ డి.వి.సూర్యనారాయణరాజు దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. కె.వెంకటాపురం, పాములవాక, కోటవురట్ల, తంగేడు, జల్లూరు, బి.కె.పల్లి తదితర గ్రామాలలో కొత్త అమావాస్యను పురస్కరించుకుని భక్తులు ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు



ఎంపీడీవోకి రాజీనామా పత్రం సమర్పిస్తున్న వలంటీర్లు



మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్‌కు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వాడ్రాపల్లి సచివాలయ వలంటీర్లు

ఎస్.రాయవరం : మండలంలో గ్రామ సచివాలయ వలంటీర్లు సోమవారం మూకుమ్మడి రాజీనామాలు చేసి వినతిపత్రాన్ని ఎంపీడీవో సత్యనారాయణకు సమర్పించారు. ఇటీవల గ్రామాల్లో అవ్వాతాతలకు గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేయకుండా అడ్డుపడిన చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు వలంటీర్లు అంతా సిద్ధం అయ్యామని, ఇకపై ప్రత్యక్షంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపునకు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తామని చెప్పారు. మండలంలో ఉన్న 420 మంది రాజీనామా చేస్తున్నట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వలంటీర్లు అప్పలరాజు, రాజు , శివ మాట్లాడుతూ అయిదేళ్లపాటు వలంటీర్లు అందించిన సేవలు వివరించి జగనన్న సంక్షేమం వివరిస్తామన్నారు. ఇకపై మా ప్రచారాన్ని ఎవరూ అడ్డుకోవడానికి అవకాశం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు నానేపల్లి అప్పలరాజు, చేపల రాజు,నాళం శివ,కుమారి, లక్ష్మి, రత్నం పాల్గొన్నారు.

మునగపాక: వాడ్రాపల్లి సచివాలయ పరిధిలోని వాడ్రాపల్లి, గొల్లలపాలెం గ్రామాలకు చెందిన 15మంది వలంటీర్లు సోమవారం రాజీనామాలు చేశారు. సంబంధిత రాజీనామాలను మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్‌కు అందజేశారు. వలంటీర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందించేందుకు వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. అయితే చంద్రబాబు చేసిన కుతంత్రాల వల్ల వలంటీర్లకు పేదలకు సేవ చేసే అవకాశం లేకుండా పోయిందన్నారు. వలంటీర్ పోస్టులను అడ్డుపెట్టుకొని ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని ఇకపై తామంతా స్వచ్ఛందంగా వలంటీర్ పోస్టుకు రాజీనామా చేస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవడమే తమ లక్ష్యమన్నారు. ఇకపై ఇంటింటికీ వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అమలైన పథకాలను ప్రచారం చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, ఈవోఆర్డీ వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

నీటి గంట పక్కాగా అమలు

మాకవరపాలెం: పాఠశాలల్లో నీటి గంట కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని ఎంఈవో పి.ఎస్.ఎన్.మూర్తి ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమ వారం నుంచి నిత్యం పాఠశాలల్లో మూడు దఫాలుగా నీటి గంట కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. వేసవి నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో ఆయన నీటి గంట కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ విషయంలో ఏ మాత్రమూ నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు.

నేటి నుంచి ఎమ్మెల్యే కన్నబాబు ప్రచారం

యలమంచిలి రూరల్: నియోజకవర్గ ఎమ్మెల్యే.ప్రస్తుత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి యూవీ రమణమూర్తిరాజు(కన్నబాబు) తన ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం నుంచి ప్రారంభించనున్నారు.ఇప్పటికి మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన ప్రతిసారి తన ఎన్నికల ప్రచారాన్ని ఏటికొప్పాక బండిమాంబ అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి కూడా అదే సెంటిమెంట్‌ను కొనసాగిస్తూ ఎమ్మెల్యే తన ప్రచారాన్ని మంగళవారంనాడు ఏటికొప్పాక నుంచి ప్రారంభించనున్నారు. ఈ మేరకు పార్టీ నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ప్రత్యేకంగా రూపొందించిన ప్రచార వాహనాన్ని కూడా మంగళవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. కన్నబాబు ముందుగా బండిమాంబ అమ్మవారిని దర్శించుకున్న తర్వాత గ్రామంలో ఇంటింటికీ తిరగనున్నారు. మరోసారి తనకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించనున్నారు. గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి విప్లవాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి మరోసారి తనకు అవకాశం ఇవ్వాలని కోరనున్నారు. ఈ ప్రచార కార్యక్రమానికి నియోజకవర్గంలో నాలుగు మండలాల నుంచి పార్టీ నాయకులు హాజరుకానున్నారు.

ఆస్తి పన్నులో 5 శాతం రాయితీ

యలమంచిలి రూరల్ : పురపాలక సంఘం పరిధిలో 2024–25 సంవత్సరానికి సంబంధించి ఆస్తిపన్నుల చెల్లింపునకు రాయితీ ఇస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ కె.ఎ.కొండలరావు తెలిపారు. ఈ నెల 30 లోగా చెల్లిస్తే 5 శాతం రాయితీ ఇవ్వనున్నట్టు ఆయన చెప్పారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని, సెలవు రోజుల్లో కూడా పన్నులు చెల్లించడానికి వీలుగా ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

తోటాడ పంచాయతీ నుంచి అత్యధిక ఓట్లు రావాలి



ఎమ్మెల్యే రమణమూర్తిరాజుతో తోటాడ వైఎస్సార్‌సీపీ నాయకులు

మునగపాక : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా కృషి చేయాలని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు కోరారు. మండలంలోని తోటాడ సచివాలయ పరిధిలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు సోమవారం ఎమ్మెల్యే రమణమూర్తిరాజును కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయిదేళ్ల కాలంలో ప్రజలకు జరిగిన మేలును ప్రచారంలో వివరించాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఎన్నికైన నాటి నుంచి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా సేవలందించారన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు లేదన్నారు. మునగపాక మండల అభివృద్ధిని చూసి ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసేలా చూడాలని ఇంటింటా ప్రచారంలో చెప్పాలన్నారు. తోటాడ పంచాయతీ నుంచి అత్యధిక ఓట్లు వచ్చేలా పాటుపడాలన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, సర్పంచ్ దొడ్డి మంగవేణి, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ ఇస్మాయిల్, మళ్ల ఈశ్వరరావు, దొడ్డి కోటేశ్వరరావు, గంగాజీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

టెంట్లు, తాగునీరు తప్పనిసరి



రాచపల్లి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రరావు

మాకవరపాలెం: ఉపాధి పనులు చేపట్టే ప్రదేశా ల్లో టెంట్లు, తాగునీరు తప్పనిసరిగా ఉండా లని ఎంపీడీవో చంద్రరావు సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని రాచపల్లి, పైడిపాల, తదితర గ్రామాల్లో ఉపాధి పనులను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మస్టర్ షీట్లను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఎంత పనిచేస్తే గిట్టుబాటు కూలి వస్తుందో కూలీలకు అవగాహన కల్పించా లని టెక్నికల్ సిబ్బందికి సూచించారు. వేసవి నేపథ్యంలో పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీరు లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.